# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-09-2025 సమయం : సాయంకాలం 6 గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ దేశ ప్రజలు రానున్న పండుగలను కేవలం స్వదేశీ ఉత్పత్తులతోనే జరుపుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.
- ❖ ప్రజారోగ్య సంరక్షణే ధ్యేయంగా పని చేస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.
- ❖ అరకు కాఫీ గిరిజన సమాజం ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు ప్రతీక అని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.
- ❖ ఆసియా కప్ టీ-20 ఫైనల్‌లో భారత్, పాకిస్తాన్‌లు ఈ రోజు రాత్రి 8 గంటలకు దుబాయ్ వేదికగా తలపడనున్నాయి.

=====================

దేశ ప్రజలు రానున్న పండుగలను కేవలం స్వదేశీ ఉత్పత్తులతోనే జరుపుకోవాలని, 'వోకల్ ఫర్ లోకల్' ను తమ నినాదంగా మార్చుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో తన భావాలను పంచుకునే "మన్ కీ బాత్.. మనసులోని మాట.." కార్యక్రమం 126వ సంచికలో భాగంగా ఈరోజు ప్రధానమంత్రి మాట్లాడుతూ.. కేవలం భారతీయులు తయారు చేసిన వస్తువులనే కొనుగోలు చేస్తామనే సంకల్పం తీసుకోవాలని కోరారు. పండుగల సమయంలో పరిశుభ్రత అనేది కేవలం ఇంటికే పరిమితం కాకుండా.. వీధులు, పరిసరాలు, మార్కెట్లు, గ్రామాల వరకు విస్తరించాలని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. వ్యాపారం నుంచి క్రీడల వరకు, విద్య నుంచి సైన్స్ వరకు ప్రతి రంగంలోనూ మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారని ప్రశంసించారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని ప్రజలంతా ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి.. ధరించాలని కోరారు. రాబోయే రోజుల్లో వరుసగా పండుగలు వస్తున్నాయని, అదే సమయంలో జీఎస్టీ బచత్ ఉత్సవం కూడా కొనసాగుతోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 24 సెకన్లు)

=====================

ప్రజల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రేపు ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా మంత్రి ఈ రోజు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ద్వారా గడిచిన 15 నెలల్లో 1.41 లక్షల మందికి గుండె సంబంధిత శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు. దీని కోసం 996 కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పారు. 161 ప్రైవేటు ఆసుపత్రులు, 26 ప్రభుత్వ ఆసుపత్రుల్లో గుండె సంబంధిత వ్యాధుల చికిత్స ప్రస్తుతం అందుబాటులో ఉందని తెలిపారు.

======================

కలాన్ని ఆయుధంగా చేసుకుని సమాజంలోని రుగ్మతలను రూపుమాపిన వ్యక్తి మహాకవి గుర్రం జాషువా అని రాష్ట్ర సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ రోజు విజయవాడలోని కలెక్టరేట్ కార్యాలయంలో ఏపీ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గుర్రం జాషువా 130వ జయంతి వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలుగు సాహిత్యాన్ని తన పాండిత్యంతో పరవశింపజేసిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని అన్నారు. భావితరాలకు జాషువా గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరాన్ని వివరించారు.

======================

అరకు కాఫీకి జాతీయ స్థాయి గుర్తింపు రావడం పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు హర్షం వ్యక్తం చేశారు. “బిజినెస్ లైన్ చేంజ్ మేకర్ అవార్డ్స్ – 2025” పురస్కారం దక్కించుకోవడం గిరిజన సమాజం గర్వించదగ్గ విషయం అని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీసీసీ ఆధ్వర్యంలో గిరిజన రైతుల కృషి ఫలితంగా అరకు కాఫీ జాతీయ స్థాయి గుర్తింపు పొందిందని మంత్రి అభినందించారు. అరకు కాఫీ కేవలం ఒక బ్రాండ్ మాత్రమే కాకుండా గిరిజన సమాజం ఆత్మగౌరవానికి, ఆర్థిక స్వావలంబనకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ అవార్డు దక్కడం ద్వారా గిరిజన రైతుల శ్రమ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని, భవిష్యత్‌లో అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు.

======================

దేశంలో గత 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అనేక రంగాలలో విశేష అభివృద్ధిని సాధిస్తోంది. ముఖ్యంగా సుపరిపాలనకు అధిక ప్రాధాన్యమిస్తూ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నాయి. “సేవా పర్వ్” పేరుతో వాటిపై ఆకాశవాణి విశాఖపట్టణం ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. అందులో భాగంగా యూపిఐపై ఒక ప్రత్యేక కథనాన్ని ఇప్పుడు విందాం..

(వాయిస్ 85 సెకన్లు)

======================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఐదవ రోజైన ఈరోజు ఉదయం శ్రీ మలయప్ప స్వామివారు మోహినీ రూపంలో సర్వాలంకార భూషితుడై దర్శనమిచ్చారు. పక్కనే మరో తిరుచ్చిపై శ్రీకృష్ణుడు అలంకృతుడై అభయమిచ్చారు. స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

======================

క్రికెట్ అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఆసియా కప్ టీ-20 క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో భారత్, పాకిస్తాన్ లు దుబాయ్ వేదికగా తలపడనున్నాయి. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం ఈ రోజు రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుంది. 41 ఏళ్ల ఆసియా కప్ చరిత్రలో, 17 ఎడిషన్లు జరిగాక... భారత్, పాకిస్తాన్‌లు ఫైనల్‌లో తలపడటం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఆసియా కప్ చరిత్రలో భారత్ అత్యంత విజయవంతమైన జట్టుగా నిలిచింది. ఇప్పటి వరకు 8 టైటిళ్లను కైవసం చేసుకున్న భారత్, 2023లో వన్డే ఫార్మాట్‌లో విజేతగా నిలిచి డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది.

======================

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది రానున్న 24 గంటల్లో అల్పపీడన ప్రాంతంగా బలహీనపడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారి బి. శేఖర్ పేర్కొన్నారు. దీని ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తాంధ్రలో రానున్న మూడు రోజుల పాటు తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందన్నారు.

======================

======================